కథ

బి.వి.భద్రగిరీష్

# గో...డౌన్!

విశ్వనాథం, వెంకట్రావుతో మాట్లాడుతున్నాడే కానీ అతడి కళ్లు వెంకట్రావు కూడా వచ్చిన గంగాధరాన్నే పరిశీలిస్తున్నాయి. వెంకట్రావుతో కలిసి తన ఇంటికి వచ్చినప్పటి నుండీ అతడి ప్రవర్తన వింతగానూ, కొంత అసహనం కలిగించేదిగా ఉంది. గంగాధరం వెంకట్రావుకి తెలిసినవాడట. ఆటోమొబైల్ బిజినెస్ చేస్తున్నాడట. ఇద్దరూ కలిసి ఏదో పనిమీద వెళుతూ వెంకట్రావు స్నేహితుడు విశ్వనాథం ఇంటికి వచ్చారు. పలకరింపులు, పరిచయాల తర్వాత అతడేమీ మాట్లాడలేదు. విశ్వనాథం ఇంటిని పరిశీలనగా చూడడంలో మునిగిపోయాడు. విశ్వనాథం, వెంకట్రావు మాట్లాడుకుంటూండగా ఒకసారి లేచి బాల్కనీలోకి వెళ్లి చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి వచ్చాడు. అతడి ప్రవర్తన విశ్వనాథానికి చికాకు కలిగించింది కానీ, వెంకట్రావు నొచ్చుకుంటాడేమోనని ఏమీ మాట్లాడలేదు. కాసేపటికి వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. విశ్వనాథం కూడా గంగాధరం గురించి మర్చిపోయాడు.

ఒక వారం తర్వాత హఠాత్తుగా ఒక్కడే ఊడిపడ్డాడు గంగాధరం. విశ్వనాథం అతడి రాకను చూసి ఆశ్చర్యపోయాడు.

పలకరింపులు, మర్యాదలు అవగానే గంగాధరం మాట్లాడడం మొదలుపెట్టాడు.

"విశ్వనాథంగారూ, నేను ఆటోమొబైల్ బిజినెస్ చేస్తున్న సంగతి మీకు తెలుసుకదా! నేను టైర్ల బిజినెస్ మొదలుపెడదామనుకుంటున్నాను. దానికి నాకొక గోడౌన్ కావాలి. పోయినసారి వెంకట్రావుతో కలిసి మీ యింటికి వచ్చినప్పుడు అంతా పరిశీలించాను. కింద రెండు పోర్షన్లు అద్దెకిచ్చినట్టున్నారు. పైన మీరు ఉంటున్నారు కదా. ఇంటి చుట్టూ స్థలం కూడా వుంది. పైగా మీ కాలనీ మెయిన్ రోడ్డుకు దగ్గరగా వుంది. కాబట్టి నేను చెప్పేదేమంటే, మీరు కింది పోర్షన్లు తీసేసి గోడౌన్‌గా మార్చి నాకు అద్దెకిచ్చారంటే బాగుంటుంది. నా ఉద్దేశ్యం ప్రకారం మీకు రెండు పోర్షన్ల మీదా కలిపి నెలకు నాలుగయిదు వేలకు మించి అద్దెరాదు. నేను నెలకు పదివేలు ఇస్తాను. మీకూ మంచి ఆదాయంగా వుంటుంది. ఏమంటారు?"

విశ్వనాథానికి ఏమనాలో తోచలేదు. గంగాధరం హఠాత్తుగా వచ్చాడంటేనే ఏదో విషయం ఉందని ఊహించాడు గానీ, ఇలాంటి ప్రపోజల్ తెస్తాడనుకోలేదు.

"పోర్షన్లు పడగొట్టాలంటే ఖర్చు అవుతుంది కదా!" గొణిగాడు.

"నేను మీకు ఆరునెలల ఎడ్వాన్సు ఇస్తాను. దానిలోంచి ఖర్చుపెట్టండి" భరోసాగా అన్నాడు గంగాధరం.

"లారీల వల్ల ఇబ్బందవుతుందేమో?" విశ్వనాథం అనుమానం వ్యక్తం చేశాడు. "అబ్బే! వారానికి రెండు మూడుకు మించి లారీలు రావు. అన్‌లోడింగ్ కూడా గంటా, రెండుగంటల్లో అయిపోతుంది. అప్పుడప్పుడూ చిన్న ఆటో ట్రాలీల్లో టైర్లని మార్కెట్‌కు పంపిస్తాము. మీకు యిబ్బందేమీ ఉండదు. నాదీ హామీ!"

ఇంతలో "ఏమండీ, ఒకసారి ఇటురండి" విశ్వనాథం భార్య పిలుపు వినిపించింది. తన ప్రపోజల్‌కు ఆమోదముద్ర పడబోతున్నట్లు గ్రహించాడు గంగాధరం.

అప్పటిదాకా తమతో స్నేహంగా ఉన్న అద్దెకుండే వాళ్లు, ఇల్లు ఖాళీ చేయమనగానే "సంవత్సరం మధ్యలో ఇల్లు ఖాళీ చేయమంటే ఎలా?" అని నిష్టూరాలాడుతూ వెళ్లిపోయారు. విశ్వనాథం మనస్సు చివుక్కుమంది. పోర్షన్ల మధ్యలో గోడలు పడగొట్టించి, షట్టర్ పెట్టించి గోడౌన్‌గా మార్చటానికి గంగాధరం ఇచ్చిన ఎడ్వాన్సు సరిపోలేదు. పైగా ఇంటిచుట్టూ ఉన్న గార్డెన్‌ను తీయించి, నేలను గచ్చు చేయించవలసి వచ్చింది లారీల రాకపోకలకు వీలుగా! విశ్వనాథానికి స్వంత డబ్బులు ఇరవై వేలు అదనంగా ఖర్చయ్యాయి. స్వతహాగా మొహమాటస్తుడైన విశ్వనాథం ఆ డబ్బుని గంగాధరాన్ని అడగలేకపోయాడు.

"ఎలాగూ పదివేలు అద్దెగా ఇస్తానన్నాడుగా, సర్దుకోవచ్చులే" అనుకున్నాడు.

మొదటి మూడు నెలలూ బాగానే గడిచాయి. అద్దెని ఠంచనుగా నెల మొదటి వారంలోనే నగదు రూపేణా ఇచ్చాడు గంగాధరం. ఆ తరవాత నుండీ చెక్కులు ఇవ్వడం మొదలుపెట్టాడు. అది కూడా తాను చెప్పిన తర్వాత బ్యాంకులో వేసుకోమనేవాడు. ఎప్పుడు బ్యాంకులో వేసుకోవాలో కనుక్కునేందుకు విశ్వనాథానికి అరడజను ఫోనుకాల్సు ఖర్చయ్యేవి. మొదట్లో తక్కువగానే ఉన్న లారీల రాకపోకలు క్రమంగా పెరిగాయి. రోజుకో లారీ లోడు రావడం మొదలయింది. విశ్వనాథం ఆరాతీస్తే, ఈమధ్య చైనా నుంచి దిగుమతి అయిన టైర్లు చవకగా ఉండడం వల్ల, మార్కెట్లో బాగా అమ్ముడుపోతున్నాయట. గంగాధరం చైనా టైర్లు అమ్ముతూ బాగా సంపాదిస్తున్నాడట. టైర్లు దించేటప్పుడు హమాలీల కేకలు, అరుపులు. లారీ, ఆటోడ్రైవర్లు, హమాలీలు చుట్టుపక్కలే కాలకృత్యాలు కానిచ్చేవారు. కొంతమంది డ్రైవర్లు తాగివచ్చి తమలో తాము గొడవలు పడుతుండేవారు. లారీల రాకపోకలతో కాలనీలోని విశ్వనాథం ఇంటి ముందు రోడ్డు గుంటలు పడడం మొదలయింది. ఇంటిచుట్టూ గచ్చు చేయించడం వల్ల సాయంత్రం అయినా ఇంట్లో వేడిగానే ఉంటోంది.

కాలనీలోని విశ్వనాథం ఇరుగుపొరుగు వారు మునిసిపాలిటీకి ఫిర్యాదు చేశారు. గంగాధరానికి చెప్తే "మీరేమీ కంగారుపడకండి. మునిసిపల్ కమీషనరు నాకు తెలుసు. అతడికి నేను చెప్తాను. ఊరికే తనిఖీ కోసం శానిటరీ ఇనస్పెక్టరును పంపిస్తాడు. అతడికి ఏదన్నా ఇచ్చి పంపండి. సరిపోతుంది" అని చెప్పాడు. ఒకరోజు శానిటరీ ఇనస్పెక్టరు రానే వచ్చాడు. అయిదు వేలకు పైసా తగ్గినా ఊరుకునేది లేదని చెప్పాడు. ఈసురోమంటూ అయిదువేలూ ఇచ్చి పంపాడు విశ్వనాథం. వీటికితోడు టైర్ల వాసన ఒకటి. పెద్దలిద్దరూ అలవాటుపడ్డా, పిల్లలు సర్దుకోలేకపోయారు. ఊరికూరికే వాళ్లకి జలుబుచేయడం మొదలుపెట్టింది.

ఒకరోజు రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న విశ్వనాథానికి బాగా వేడి, ఉక్కగా అనిపించి, హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఘాటుగా టైర్ల వాసన తగుల్తోంది. చూస్తే కిటికీలోంచి ఇంట్లోకి పొగలు వస్తున్నాయి. కింద నేల వేడిగా ఉంది. బాల్కనీలోకి వెళ్లి కిందికి చూస్తే ఏముంది!? కింద గోడౌన్‌లో టైర్లు అంటుకుని మంటలు వస్తున్నాయి. దట్టమైన పొగ విశ్వనాథాన్ని కమ్ముకుంది. అతడికి ఉక్కిరిబిక్కిరై దగ్గు వచ్చింది. ఇంతలో విశ్వనాథం భార్య కూడా లేచింది. క్రమంగా మంటలు పెద్దవవుతున్నాయి. అప్పటికే మెట్ల వైపు

వ్యాపించాయి. మెట్లగుండా దిగే అవకాశం లేదు. ముందు ప్రాణాలు రక్షించుకోవాలి. పిల్లల్తో సహా వెను కవైపు బాల్కనీలోంచి గోడమీదకు దిగి, అక్కడనుండి గోడ అవతలికి దూకి ప్రాణాలు రక్షించుకోగలిగారు. అంటుకున్నది టైర్లు కావడంతో మంటలు త్వరత్వ రగా పెద్దవవుతున్నాయి. పొగ, వానన ధాటికి చుట్టు పక్కలవాళ్లు కూడా లేచారు. టైర్లు బాగా మండుతుం డడంతో వేడికి భయపడి ఎవరూ దగ్గరకి వెళ్లే సాహసం చేయలేకపోతున్నారు. ఎవరో ఫైరింజన్‌కి ఫోన్ చేశారు. మంటలు ఎలా అంటుకున్నాయనే విష యమై ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వాళ్లు చేస్తు న్నారు. ఒకవైపు ఏడుస్తున్న భార్యపిల్లలను సముదా యించలేక, ఇంకొకవైపు కష్టపడి కట్టుకున్న ఇల్లు, సంపాదించుకున్న వస్తువులు కాలి బూడిదవుతుంటే చూడలేక ముఖాన్ని చేతులతో కప్పుకొని కూలబడిపో యాడు విశ్వనాథం. ఫైరింజన్లు వచ్చి మంటలార్పే సమయానికి ఏమీ మిగల్లేదు. విశ్వనాథం భార్యాబిడ్డ లతో, కట్టుబట్టలతో మిగిలాడు.

ఇప్పుడు విశ్వనాథం అద్దె ఇంట్లో, పరిమితమైన సామాన్లతో జీవితం గడుపుతున్నాడు. తగలబడిన ఇంటిని పరీక్షించిన ఇంజనీరు, ఇల్లు ఉండడానికి పని కిరాదనీ, కూలగొట్టి మళ్లీ కట్టుకోవాల్సిందేనని తేల్చాడు. కట్టుకోవడం మాట దేవుడెరుగు, కూలగొట్ట డానికే లక్ష రూపాయలు కావాలి. యాక్సిడెంట్ అయిన రోజునుండీ గంగాధరం పత్తాలేడు. అతడు తెచ్చిన టైర్లు ఎలాంటి పన్నులూ చెల్లిం చకుండా దిగుమతి చేసుకున్న స్మగుల్డ్ గూడ్సట! ఈ విషయం బయటపడిందనీ, తప్పించుకో వడానికి గంగాధరమే గోడౌన్ అంటించేసి ఉంటాడనీ కొందరు వ్యాఖ్యానించారు.

గంగాధరం వివరాల కోసం కమర్షియల్ టాక్సు డిపా ర్ట్‌మెంట్‌వారు, అనుమతుల్లేవంటూ పోలీసు మరియు మునిసిపాలిటీవారు వచ్చి తగులుకున్నారు. వారితో, వీరితో చెప్పించి డిపార్టుమెంటువారిని వదిలించుకునే సరికి విశ్వనాథానికి మరింత చేతిచమురు వదిలింది. స్వంత ఇంటిని కోల్పోవడమేగాక విశ్వనాథం అప్పుల బారిన పడ్డాడు. కాలిపోయిన ఇల్లు ఉన్న స్థలం అమ్మ టమే అతడికి మార్గంగా మిగిలింది. స్థలం అమ్మకా నికి బ్రోకర్లకు చెబితే "అగ్నిప్రమాదం జరిగిన చోట, అగ్నిదేవుడు పుష్కరకాలం కాపురం వుంటాడటండీ!" అని సెంటిమెంటుని వక్కాణించి, మార్కెట్ ధరలో సగానికి సగం తగ్గించి అడిగారు. "రేటు తగ్గిస్తే, అగ్ని దేవుడు కాపురం మానుకుంటాడా?" అని విశ్వనాథం అడిగితే వాళ్లేమీ మాట్లాడలేదు.

ఒకరోజు విశ్వనాథం బజార్లో నిలబడి ఉండగా, పక్కనే ఎవరో ఇద్దరు మాట్లాడుకోవడం విన్నాడు. "మా యింటి పక్కన ఖాళీ స్థలం వుందికదా! దాన్ని చెప్పుల గోడౌన్ కోసం అడుగుతున్నారు. గోడౌన్ వాళ్లే కట్టు కుంటా రట, అద్దె బాగానే ఇస్తామంటున్నారు..." ఒకాయన వేరే అతనితో చెబుతున్నాడు. వాళ్లెవరో పరిచయం లేకపోయినా, నెమ్మదిగా వాళ్లదగ్గరికి వెళ్లి మాట్లాడినా యన భుజం మీద తట్టాడు. ఆయన విశ్వనాథం వంక ఏమిటన్నట్లు చూశాడు. విశ్వనాథం ఏమీ మాట్లాడ కుండా చేత్తో రోడ్డు అవతలవైపు చూపించాడు. అక్కడ ఒక వీధి గారడీ వాడు చుట్టూ చేరిన జనాల దగ్గర డబ్బులు తీసుకుని, నిప్పులమీద, వేడెక్కిన పెనంమీద కూర్చోవడానికి సిద్ధపడుతున్నాడు.

○

